నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | WARANGAL



హనుమకొండ కేడీసీలో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ కేడీసీలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు**

| జిల్లా పేరు | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|
| హనుమకొండ | 15 | 2,943 | 2,272 | 5,215 |
| వరంగల్ | 13 | 1,474 | 878 | 2,352 |
| మహబూబాబాద్ | 16 | 1,112 | 551 | 1,663 |
| జనగామ | 12 | 614 | 388 | 1,002 |
| ములుగు | 09 | 405 | 223 | 628 |
| భూపాలపల్లి | 12 | 279 | 133 | 412 |

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

## ఉమ్మడి జిల్లాలో 11,189 మంది ఓటర్లు

- 76 పోలింగ్ కేంద్రాలు
- నేటి ఉదయం 8 గంటల నుంచి పోలింగ్
- మార్చి 3వ తేదీన లెక్కింపు

హనుమకొండ, ఫిబ్రవరి 26 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాల యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉమ్మడి జిల్లా పరిధిలో 11,189 మంది టీచర్లు ఓటర్లు ఉండగా 76 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సలను సిద్ధం చేశారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా జంబో బాక్సులు వినియోగిస్తున్నామని, వీటిని ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆయా జిల్లాల్లో నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరుగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 19మంది బరిలో ఉండగా కేవలం ఆరుగురు అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉందనే ప్రచారం సాగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన 19 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డును ఓటర్లు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 27న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది.



జయశంకర్ జిల్లా కేంద్రంలో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

### నేడు ఓటింగ్

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి గురువారం ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ జరుగనున్నది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ కొనసాగనున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,189 మంది ఓటర్లకు గాను 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే హనుమకొండ జిల్లాలో 8, వరంగల్ జిల్లాలో 6, ములుగు జిల్లాలో 3 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే పలుమార్లు అధికారులతో క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహించి పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,189 ఓటర్లు

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,189 మంది టీచర్లు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో పురుషులు 6,886 మంది, మహిళలు 4,469 మంది ఉన్నారు. కాగా అత్యధికంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఓటర్లు ఉన్నారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు సైతం ఈ జిల్లాలో ప్రచారం జోరుగా చేసినట్లు తెలుస్తున్నది. హనుమకొండ జిల్లాలో 5,215 మంది, వరంగల్‌లో 2352 మంది, మహబూబాబాద్‌లో 1,663 మంది, జనగామలో 1,002 మంది, ములుగులో 628 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 329 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే పూర్వ కరీంనగర్ జిల్లా పరిధిలో విస్తరించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హార్ మండలాల్లో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్లు 2,483 మంది, జిల్లాలో జరుగునున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 83 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. అలాగే హనుమకొండ జిల్లాలోని కమలాపుర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాల్లో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 166 మంది, పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లు 4,585 మంది ఉన్నారు. వీరంతా నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.




ఒక్క ఓటు కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్

## ఒక్క ఓటు.. ఐదుగురు సిబ్బంది

### జయశంకర్ జిల్లా పలిమెలలో పోలింగ్ బూత్ ఏర్పాటు

పలిమెల, ఫిబ్రవరి 26 : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పలిమెల మండలంలో మొదటి సారి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్లు 38 మంది ఉండగా.. టీచర్ ఎమ్మెల్సీకి ఒక ఓటరు మాత్రమే ఉన్నారు. ఒక్క ఓటరుకు బూత్ ఏర్పాటు చేయడమే కాకుండా ఐదుగురు సిబ్బందితో పాటు పోలీస్‌లను నియమించారు.

# అనుమతి లేకుండా ఎడ్లబండ్ల పందేలు

- జాతీయ రహదారిపై నియంత్రణ లేకుండా పరిగెత్తిన బండ్లు
- వేగంగా వెళ్లి ఆటోను ఢీకొట్టిన వైనం
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు, వాకర్స్

హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి 26 : ఎలాంటి అనుమతులు లేకుండా ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి మెదక్ వెళ్లే 765 డీజీ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఎడ్ల బండ్ల పందేలు నిర్వహించడం సంచలనంగా మారింది. ఈ విషయం పోలీసులకు కూడా తెలియకపోవడం విశేషం. 20 ఎడ్లబండ్ల ముందు ద్విచక్ర వాహనాలపై ఎస్కార్ట్‌గా వెళ్తున్న యువకులు అరుపులు, ఈలలు, చప్పట్లతో వెళ్తుండడంతో ఎదురుగా వస్తున్న వాహనదారులు బెంబేలెత్తి పక్కకు జరిగారు. ఈ క్రమంలో ఓ ఆటోను వేగంగా వచ్చిన ఎడ్లబండి అదుపు తప్పి ఢీకొట్టగా డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. దీంతో దారి పొడవునా ప్రయాణికులు, వాకర్స్ ఇబ్బంది పడ్డారు. అయితే రెండు పోలీస్ స్టేషన్లలోని కొందరు సిబ్బందికి ముందుగానే నిర్వాహకులు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తున్నది. కాగా, ఈ పందేలను కొద్దిరోజులుగా కమలాపూర్ నుంచి అదే మండలం శనిగరం వరకు నిర్వహించినట్లు సమాచారం. అయితే ఆ మార్గంలో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడడంతో అక్కడి పోలీసులు పోటీలకు నిరాకరించడంతో ఎల్కతుర్తి నుంచి కొత్తపల్లి వరకు పందేలు నిర్వహించినట్లు తెలిసింది. ఇందులో కమలాపూర్ మండలం గుండేడు, కానిపర్తి, ధర్మసాగర్ మండలం దేవునూరు, భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలం దండేపల్లి, హుజూరాబాద్ మండలం కందుగులకు చెందిన యువ రైతులు ఇందులో పాల్గొన్నట్లు తెలిసింది.



ఎల్కతుర్తి వద్ద పోటీపడుతున్న ఎడ్ల బండ్లు



ఎల్కతుర్తి వద్ద ఎడ్లబండి ఢీకొట్టడంతో ధ్వంసమైన ఆటో

### ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్

ఈ ఎడ్లబండ్ల పోటీల కోసం ప్రత్యేకంగా ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. ఇందులో సభ్యత్వం పొందాలనుకునే వారు కొంత నగదు చెల్లించాల్సి ఉంటుంది. అందు లో పోటీలు నిర్వహించే తేదీ, సమయం, స్థలం తదితర వివరాలను నిర్ధారించుకుంటారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు నగదు రూపంలో అందజేస్తున్నట్లు తెలిసింది. దీంతో కొందరు యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఎడ్లను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.



పాలకుర్తి సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడి దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- భోళా శంకరుడికి ప్రత్యేక పూజలు
- ఉపవాస దీక్షతో జాగారం చేసిన ప్రజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

# శంభో.. శివ శంభో

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



విద్యుత్ దీపాల వెలుగులో కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి ఆలయం

*'ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ.. శంభో శంకర' అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాస దీక్ష చేపట్టి ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు భోళా శంకరుడి దర్శనం కోసం బారులు తీరారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి, ఐనవోలు మల్లికార్జున స్వామి, వరంగల్‌లోని కాశీ విశ్వేశ్వర, కోటి లింగాల ఆలయాలు, ములుగు జిల్లాలోని రామప్ప, జయశంకర్ భూపాలపల్లిలోని కాళేశ్వరం, కోటగుళ్లు, మహబూబాబాద్‌లోని కురవి వీరభద్రస్వామి, జనగామలోని పాలకుర్తి సోమేశ్వరాలయం, కొడవటూరు సిద్ధులగుట్టతో పాటు అన్ని ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఐనవోలులో మల్లికార్జునస్వామికి ప్రీతిపాత్రమైన పెద్దపట్నంను ఒగ్గు పూజారులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాళేశ్వరంలో శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తుల జాగరణ కోసం ఆలయాలు, ప్రత్యేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.* - నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 26



ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అందంగా వేసిన పెద్దపట్నం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# శివతత్వానికి ప్రతీక ఓరుగల్లు

- వరంగల్‌కు శివరాత్రి పండుగకు అనుబంధం ఉంది
- పేరిణి పుట్టినిల్లు ఈ ప్రాంతం
- హిందుధర్మ పరిరక్షకులపై దాడిని ఖండించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- అలరించిన మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం

హనుమకొండ, ఫిబ్రవరి 26 : శివతత్వానికి ఓరుగల్లు ప్రతీక అని.. వరంగల్‌కు మహాశివరాత్రి పండుగకు అనుబంధం ఉన్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హిందుధర్మ పరిరక్షణకు పాటుపడుతున్న చిలుకూరు ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడిని ప్రతి హిందువు ఖండించాలన్నారు. ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ హయగ్రీవాచారి మైదానంలో బుధవారం నిర్వహించిన మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఓరుగల్లును పాలించిన కాకతీయులు శివున్ని పూజించేవారని ఆయన పేర్కొన్నారు. నగరంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం శివతత్వాన్ని మరింత పెంపొందిస్తుందని చెప్పారు. శివరాత్రి అంటే చెంబెడు నీళ్లు.. బిల్వ పత్రం ఉంటే చాలని అన్నారు. పొద్దంతా ఉపవాసం.. రాత్రంతా జాగరణతో ప్రజలు ఉండటం పండగ ప్రత్యేక అని పేర్కొన్నారు. ఈ పండుగ రోజున గతంలో రాత్రి వేళల్లో పాత సినిమాలు వేసేవారని, ప్రస్తుత రోజుల్లో ఆలయాలకు, ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. దేవున్ని నిండు మనసు, ఏకాగ్రతతో వేడుకొంటే వచ్చే ఉల్లాసం, ప్రశాంతత ఏ పదవిలో, సంపదలో దొరకవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమం ఏర్పాటుచేసిన ఇండస్ ఫౌండర్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులకు మాజీ మంత్రి అభినందనలు తెలిపారు. శివతత్వాన్ని కల్గి ఉన్న వరంగల్ గడ్డపై పుట్టడం తన అదృష్టమని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. భారతదేశంలోనే వరంగల్‌కు గొప్ప చరిత్ర ఉన్నదన్నారు. రామాయణం రాసిన వాల్మీకి, భాగవతాన్ని రాసిన బమ్మెర పోతనలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారేనన్నారు. అలాగే కాకతీయ రాజులు సైతం రామప్ప, వేయిస్తంభాల ఆలయం లాంటి శైవక్షేత్రాలను నిర్మించారన్నారు. ఇదొక అద్భుత కార్యక్రమమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్‌కు ప్రత్యేకమైన విశిష్టత ఉందన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులకు కేసీఆర్ నాయకత్వంలో హరీశ్‌రావు పూర్వవైభవం తీసుకొచ్చారని కొనియాడారు. ఓరుగల్లు విశిష్టత, శివతత్వాన్ని, ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఐదేళ్లుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమానికి ఓరుగల్లు ప్రజలు ఆదరిస్తున్నారని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ పురస్కార అవార్డులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, ఒడితెల సతీశ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, సీఎస్ రంగరాజన్, గడ్డం సమ్మయ్య, జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యక్రమానికి చేరుకోగా జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.



శివనామస్మరణ చేస్తున్న జాగరణ భక్తులు

# బ్యాటరీ పేలి దగ్ధమైన ఎలక్ట్రిక్ ఆటో

### చార్జింగ్ పెట్టిన సమయంలో ప్రమాదం.. రూ. 5 లక్షల మేర నష్టం

గీసుగొండ, ఫిబ్రవరి 26 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాల గ్రామంలో చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ ప్యాసింజర్ (పియాగో) ఆటో బ్యాటరీ పేలి కాలి బూడిదైంది. బాధితుడు, ఆటో యజమాని బోగి శివకుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. 11 నెలల క్రితం ఎలక్ట్రిక్ ప్యాసింజర్ ఆటోను కొనుగోలు చేశాడు. ఆ సమయంలో డౌన్ పేమెంట్ కింద రూ. 40 వేలు చెల్లించి, మిగతా రూ 4.68 లక్షలకు ఫైనాన్స్ తీసుకున్నాడు. ఆటో నడపగా వచ్చిన ఆదాయంతో నెలనెలా ఈఎంఐలు కడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో శివకుమార్ ఆటోకు చార్జింగ్ పెట్టి ఇంట్లో పడుకోగా, 10.50 గంటల ప్రాంతంలో ఇంటి పక్కనున్న వ్యక్తి ఫోన్ చేసి ఆటోలో మంటలు వస్తున్నాయని చెప్పాడు. దీంతో బయటకు వచ్చి చూసే సరికే ఆటో మంటల్లో కాలిపోతున్నది. చుట్టుపక్కల వారి సహాయంతో మంటలను ఆర్పగా అప్పటికే ఆటోలో ఉన్న సీట్లు, టాప్, వైర్లు, డెక్కు మొత్తం కాలిబూడిదయ్యాయి. ఆటో నడిస్తేనే తన కుటుంబం గడుస్తుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు.



వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాలలో కాలిపోయిన ఎలక్ట్రిక్ ప్యాసింజర్ ఆటో